# బస్తీ దవాఖానాకు సుస్తీ


కొత్తకోటలో మూతపడిన బస్తీ దవాఖానా

- వైద్యుడు లేక రోగుల ఇబ్బందులు
- కొన్ని నెలలుగా మూతపడిన వైనం
- పట్టించుకోని పాలకులు

**కొత్తకోట రూరల్:** జిల్లా ఏరియా ఆస్పత్రిలపై పని ఒత్తిడి తగ్గించడం, రోగులకు దగ్గరలో వైద్య సేవలు అందించే లక్ష్యంతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ పట్టణాల్లో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసింది. ఈ మేరకు కొత్తకోట పట్టణంలోని 14వ వార్డులో రెండేళ్ల క్రితం బస్తీ దవాఖానా ఏర్పాటు చేశారు. ఒక వైద్యుడు, ఒక స్టాఫ్ నర్స్, ఒక సపోర్టింగ్ స్టాఫ్ విధులు నిర్వహించాల్సి ఉంటుంది. వైద్య చికిత్సలతో పాటు రోగ నిర్ధారణ పరీక్షలకు శాంపిల్స్ సేకరిస్తారు. బస్తీ దవాఖానాలో సేకరించిన శాంపిల్స్‌ను జిల్లా ఆస్పత్రి డయోగ్నోస్టిక్ హబ్ సిబ్బంది రోజు వారీగా సేకరిస్తారు. అదేరోజు లేదా మరుసటి రోజు సంబంధిత వ్యక్తుల సెల్‌ఫోన్‌కు మెసేజ్ రూపంలో రిపోర్టు వస్తుంది. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు బస్తీ దవాఖానా రోజువారీగా సుమారు 100 మంది చికిత్సల నిమిత్తం వస్తుంటారు. సుమారు 50 మందికి పైగా రోగ నిర్ధారణ పరీక్షల కోసం శాంపిల్స్ సేకరిస్తారు. ఈ దవాఖానాను 11వ వార్డు, 13వ వార్డు, 12వ వార్డు, 15వ వార్డుల ప్రజలు సద్వినియోగం చేసుకునేవారు.

### వైద్యుడు లేక మూతబడిన బస్తీ దవాఖానా

పట్టణంలోని బస్తీ దవాఖానాలో వైద్యుడి పోస్టు ఖాళీగా ఉంది. దీంతో దవాఖానకు వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. 100 మంది రోగులకు స్టాఫ్ నర్సు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్తీ దవాఖాన అందుబాటులో ఉన్నప్పటికీ డాక్టర్ లేకపోవడం, ఇతర సిబ్బంది రాకపోవడంతో చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి లేదా ప్రైవేట్ ఆస్పత్రికి రోగులు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో బస్తీ దవాఖానా మూతపడింది. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి ఖాళీగా ఉన్న వైద్యుడి పోస్టును భర్తీ చేసి, సిబ్బందిని నియమించి బస్తీ దవాఖానాను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

### డాక్టర్ పోస్టును భర్తీ చేయాలి



బస్తీ దవాఖానా ప్రారంభించినప్పటి నుంచి వైద్య చికిత్సలు కొంతకాలం అందించి, మందులు సైతం ఉచితంగా ఇచ్చారు. కొంత కాలంగా డాక్టర్ లేకపోవడంతో ఉన్న సిబ్బంది రోగులకు సేవలు అందించారు. ప్రస్తుతం రెండు నెలలుగా బస్తీ దవాఖానా మూతపడింది. దీంతో నాలుగు వార్డులకు సంబంధించిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎమ్మెల్యే దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లి వెంటనే డాక్టర్ పోస్టును భర్తీ చేయించాలి.

– నిక్సన్, సీఐటీయూ, జిల్లా ఉపాధ్యక్షులు

### పాలకులు స్పందించాలి



గత ప్రభుత్వం పేదలకు అందుబాటులో వైద్య సేవలు అందించాలనే సదుద్దేశంతో బస్తీ దవాఖానా ఏర్పాటు చేశారు. బస్తీ దవాఖానా కొన్ని నెలలుగా మూతపడింది. దీంతో ఆయా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి బస్తీ దవాఖానాను అందుబాటులోకి తీసుకురావాలి.

– వేముల సుధాకర్‌రెడ్డి, గణేష్ నగర్ కాలనీ

## క్లుప్తంగా

### ముందస్తు అరెస్టు చేయడం సరికాదు




**వనపర్తి రూరల్:** చలో హైదరాబాదు కార్యక్రమానికి అసంఘటిత రంగ కార్మికులు వెళ్లకుండా ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం సరికాదని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు తీవ్రంగా ఖండించారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పందిమల్ల రాములు, మధు, నాగేషు, మల్లయ్య, రాములు, కురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

**పాన్‌గల్:** సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న కార్మికుల అక్రమ అరెస్టు సరికాదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశంరాము శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తుండగా ముందస్తుగా పోలీసులు అరెస్టు చేయడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం, సమస్యల పరిష్కారం కోసం పోరాడే కార్మికులను అరెస్టు చేయడాన్ని కార్మికుల తరఫున తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలన్నారు.

**ఆత్మకూర్:** ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టు చేయడం పోలీసులకు షరమాములు అయ్యిందని ఏఐవైఎఫ్ జిల్లాకార్యదర్శి కుతూబ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నాయకులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడంపై నాయకులు ధ్వజమెత్తారు. పోలీసులు సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టు అయినవారిలో నాయకులు రవి, యూనూస్‌లతో పాటు ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బోరింగ్ శ్రీనివాసులు ఉన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



**పాన్‌గల్:** మండలంలోని మాందాపూర్ గ్రామానికి చెందిన గొబ్బూరి శ్రీనివాసులకు రూ.26 వేలు, దిండి మధుకుమార్‌కు రూ.20 వేల చెక్కులను శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్ లబ్ధిదారులకు అందజేశారు. సీఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదన్నారు. చెక్కులు మంజూరుకు కృషి చేసిన మంత్రి జూపల్లికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయరాములు సాగర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### ధ్రువపత్రాలు, సామగ్రి చోరీ

**పాన్‌గల్:** ఇంటి తాళాలు ధ్వంసం చేసి ధ్రువపత్రాలు, విలువైన సామగ్రి, నగదు చోరీ చేసిన సంఘటనపై శనివారం కేసు నమోదైనట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన తిరుమల్ మహేశ్వర్‌రెడ్డి వృత్తి రీత్యా కొన్ని సంవత్సరాలుగా హైదరాబాద్‌లో ఉంటూ అప్పుడప్పుడు గ్రామానికి వచ్చిపోతుంటాడు. ఇదే క్రమంలో గత నెల 9న సొంత గ్రామానికి వచ్చి 10న తిరిగి హైదరాబాదుకు వెళ్లాడు. ఫిబ్రవరి 13 సాయంకాలం వీరి పాలేరు జయరాములు ఫోన్ చేసి ఇంటి తాళాలు ధ్వంసం చేశారని సమాచారం ఇచ్చాడు. 14న హైదరాబాద్ నుంచి గ్రామానికి వచ్చి ఇంటి లోపలి కిచెన్, బెడ్ రూం తాళాలు ధ్వంసం చేసి ఉన్నాయి. ఆల్మారాలు, రెండు పెట్టలలో ఉన్న భూమి పాసు పుస్తకాలు, రిజిస్ట్రేషన్, ఒప్పంద పత్రాలు, చీరలు, రెండు గ్యాస్ సిలిండర్లు, విద్యుత్ సామగ్రి, కొన్ని విలువైన పత్రాలు, రూ.10 వేల నగదు చోరీ గురైనట్లు గుర్తించారు. పాలివరు కందూరు అలివేలమ్మ, కందూరు నాగేశ్వర్‌రెడ్డి, కందూరు శిరీష వీరి సన్నిహితులు పరమేశ్వర్‌రెడ్డి, డేవిడ్, అరుణ్‌కుమార్‌రెడ్డి, నాగిరెడ్డిలపై అనుమానం ఉందన్నారు. ఈ సంఘటనపై శనివారం తిరుమల్ మహేశ్వర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

### వ్యక్తికి రిమాండ్

**చిన్నంబావి:** గతేడాది నవంబర్ నెలలో మండలంలోని పెద్దమారు గ్రామంలో జరిగిన కేసులో నిందితుడికి 14రోజుల జైలు శిక్ష పడినట్లు ఎస్ఐ జగన్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు..వివరాలోకి వెళ్తే మండలంలోని పెద్దమారు గ్రామానికి చెందిన పోగుల రాధ గతేడాది నవంబర్ నెలలో శుభకార్యానికి వెళ్లి తిరిగి వచ్చే సరికి ఇంట్లో ఉన్న ఒకటిన్నర గ్రాముల బంగారం, ఆరు జతల పట్టీలు, రూ.45వేల నగదు దొంగతనం గురైనట్లు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు గ్రామానికి చెందిన గృహశేఖర్ మీద అనుమానంతో విచారణ చేయగా నేరాన్ని ఒప్పుకోవడంతో నిందితుడి దగ్గర ఒకటిన్నర గ్రాముల బంగారం, ఆరు జతల పట్టీలు, రూ.45వేల నగదును రికవరీ చేసి కోర్టులో హాజరు పర్చగా నిందితుడికి 14రోజులు జైలు శిక్ష పడినట్లు తెలిపారు.

# గ్రామాల్లోనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు


పాన్‌గల్ మండలం వెంగళాయిపల్లిలో అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

**పాన్‌గల్:** క్షయవ్యాధి నిర్మూలన 100 కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని వెంగళాయిపల్లి గ్రామంలో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్మూలన కోసం కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశానుసారం గ్రామానికే అంబులెన్స్‌లో మొబైల్ ఎక్స్‌రే, తెమడ పరీక్షలు చేసే యంత్రాలు వచ్చి అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. నిర్ధారణ పరీక్షలు చేయించుకొని క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. వ్యాధి గ్రస్తులకు నిశ్చయ్ పోషణ్ యోజన, ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ క్రింద పౌష్టికాహారం తీసుకోవడానికి నెలకు రూ.1000 అందజేస్తారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామయ్య, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యులు తారకాశంక్, టీబీ జిల్లా కోఆర్డినేటర్ ఖాజా, ఎక్స్‌రే టెక్నీషియన్ సురేందర్, రాంచంద్రయ్య, సతీష్‌కుమర్, రమాదేవి, వినోద్, సతీష్‌కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# దళితవాడలో ప్రభుత్వ భూమిని సర్వే చేయండి


డీటీకి వినతి పత్రాన్ని అందిస్తున్న కేవీపీఎస్ నాయకులు

**అమరచింత:** పట్టణంలోని దళితవాడలోని సర్వేనంబర్ 506లో గల ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేసి వాటిని కాపాడుకునేలా కంచెను ఏర్పాటు చేయాలని కేవీపీఎస్ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఈ.శ్యాంసుందర్, అజయ్‌లు మాట్లాడారు. పట్టణంలోని 5వ వార్డులో సర్వే నంబర్ 506లో 1382లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి 9.12 గుంటల భూమిని ఇచ్చారన్నారు. ఇదే కాలనీలో ఓ వ్యకి పట్టా భూమి అని చెప్పి 1.3 గుంటలు కొనుగోలు చేసి వెంచర్ ఏర్పాటు చేశారని, ఆ స్థలం పట్టా భూమి ఎక్కడిదనే అభ్యంతరాలతో అనుమానాలు వ్యక్తం చేస్తున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా తహసీల్దార్ చొరవ చూపి సర్వే నంబర్ 506లో 1.3 గుంటల స్థలం ఎక్కడిదో సర్వే చేసి ఘర్షణలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డీటీ రెడ్యానాయక్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో విజయ్, శ్యాము, రవి, నిశాంత్‌లు పాల్గొన్నారు.

# నెల్విడి తండాకు బీటీరోడ్డు


నెల్విడి తండాలో కొనసాగుతున్న బీటీ రోడ్డు పనులు

**మదనాపురం:** మదనాపురం మండలంలోని లక్ష్మీపురం నుంచి నెల్విడి తండా వరకు శనివారం బీటీ రోడ్డు వేయడంతో తండావాసులు సంతోషం వ్యక్తం చేశారు. గత కొన్ని ఏళ్ల తరబడి మట్టి రోడ్డు గుండా నడిచి అలిసిపోయామని వర్షాకాలంలో బురద ఏర్పడి నడవలేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. ప్రస్తుతం తండా కు రోడ్డు బీటీరోడ్డు వేయడంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పాటు అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని తండా వాసి తిరుపతి నాయక్ తెలిపారు.

# భర్త వేధింపులపై కేసు నమోదు

**పాన్‌గల్:** అదనపు కట్నం తీసుకురావాలని భర్త వేధించిన సంఘటనపై శనివారం కేసు నమోదైనట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కేతేపల్లి గ్రామానికి చెందిన తలారి చెన్నమ్మకు జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండలం కొనేరు గ్రామానికి చెందిన తలారి భాస్కర్‌కు ఇచ్చి 2012లో వివాహం జరిగింది. వివాహ సమయంలో వరకట్నం కింద రూ.లక్ష నగదు, 4 తులాల బంగారం ఇచ్చారు. వారికి ముగ్గురు ఆడపిల్లలు, ఒక బాబు సంతానం ఉన్నారు. గత 12 సంవత్సరాల నుంచి భర్త మద్యానికి బానిసగా మారి ముగ్గురు ఆడపిల్లలకు జన్మనిచ్చావని దీంతో అదనపు కట్నం తీసుకురావాలని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. ఇద్దరు పెద్ద కూతురులను అలంపూర్ ప్రభుత్వ వసతి గృహంలో చదువుకుంటున్నారు. నేను మిగతా ఇద్దరు చిన్నారులతో కలిసి భర్త దగ్గరనే ఉంటున్నారు. పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి సర్ది చెప్పినా, అతనిలో ఎలాంటి మార్పు రాలేదు. గతేడాది నవంబర్ 9న కూలీ చేసిన డబ్బులు ఇవ్వమని భర్త అడగగా, ఇవ్వకపోవడంతో బూతులు తిడుతూ చేతులతో, కట్టెలతో దాడి చేసి గాయపర్చాడు. ఇద్దరు చిన్న పిల్లలతో ఇంట్లో నుంచి గెంటి వేశాడు. ఆమె తల్లిగారి ఊరు కేతేపల్లికి వచ్చారు.. శనివారం పోలీస్ స్టేషన్‌లో భర్త తలారి భాస్కర్ వేధింపులపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

# సకాలంలో ఇంటి పన్ను చెల్లించండి


వీపనగండ్లలో ఇంటిపన్ను చెల్లిస్తున్న వృద్ధురాలు తెలుగు రంగమ్మ

**వీపనగండ్ల:** సకాలంలో ఇంటి పన్ను చెల్లించి సహకరించాలని వీపనగండ్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి మండల కేంద్రంలోని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను చెల్లించాల్సిన ఇంటిపన్ను బకాయిలను ఈ నెల 26వరకు చెల్లించి సహకరించాలని ఆయన కోరారు. మండల కేంద్రానికి చెందిన తెలుగు రంగమ్మ నడవలేని స్థితిలో కూడా పంచాయతీ కార్యాలయానికి వచ్చి ఇంటి పన్ను చెల్లించారని వృద్ధురాలిని ఆదర్శంగా తీసుకొని గ్రామస్తులు సకాలంలో ఇంటి పన్ను చెల్లించాలని ఆయన కోరారు.

# లక్ష్యంతో చదివితేనే విజయం సాధ్యం


సన్మానం పొందిన వారితో ఎంఈఓ, ఎమ్మార్సీ సిబ్బంది

**పాన్‌గల్:** లక్ష్యానికి అనుగుణంగా చదివితే తప్పక విజయం సాధిస్తారని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో మండలంలో ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారితో పాటు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీలో డాక్టరేట్ సాధించిన వారిని విద్యాశాఖ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. విద్యతోనే సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తుందన్నారు. మనిషికి విద్య ఉంటే అది మనల్ని కాపాడుతుంది, డబ్బు ఉంటే దానిని మనం కాపాడాలన్నారు. పాన్‌గల్‌కు చెందిన గెంటిల రాంబాబు పీహెచ్‌డీలో డాక్టరేట్, పాన్‌గల్‌కు చెందిన స్వప్న, కేతేపల్లికి చెందిన శశికుమార్, గోప్లాపూర్‌కు చెందిన రాజు వీరు ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు తెలిపారు. వారిని విద్యార్థులు, యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఎస్ ఉపాధ్యాయ బృందం వెంకటేష్‌యాదవ్, ప్రేమ్‌కుమార్, ఎమ్మార్సీ సిబ్బంది మూర్తి, శేఖర్, భార్గవి, గోవింద్, రమాదేవి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థికి వీల్ చైర్ అందజేత..

మండలంలోని కేతేపల్లి గ్రామానికి చెందిన భానుప్రసాద్‌కు విద్యాశాఖ సమగ్రశిక్ష అలింకో ఆధ్వర్యంలో మంజూరైన వీల్‌చైర్, రొలేటర్‌ను వారి ఇంటికి వెళ్లి ఎంఈఓ శ్రీనివాసులు అందజేశారు. ఉపకరణలు సక్రమంగా వినియోగించుకొని విద్యార్థికి ఉపయోగపడేలా చూసుకోవాలని ఎంఈఓ తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఐఆర్పీ సంతోష్, ఉపాధ్యాయులు వెంకటేష్‌యాదవ్, కంప్యూటర్ ఆపరేటర్ మూర్తి పాల్గొన్నారు.

# మంచినీటిపై అవగాహన


మంచినీటిపై విద్యార్థులకు అవగాహన

**వనపర్తి రూరల్:** ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చెలిమి సంస్థ అధ్యక్షులు రవి మంచినీటి ప్రాధాన్యత, ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన నీటి పొదుపు, పారిశుద్ధ్య నీటి ప్రాధాన్యత, కలుషిత నీటి వల్ల వచ్చే అనర్థాలు, పలు విషయాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిరాజచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఖిల్లాఘనపురంలో..

**ఖిల్లాఘనపురం:** మండల పరిధిలోని మానాజీపేట, హరిజనవాడ పాఠశాలల్లో ప్రపంచ జలదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్, స్లోగన్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ముస్లింలకు ఇఫ్తార్



**అమరచింత:** పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు చెపట్టిన ముస్లింలకు శనివారం పట్టణానికి చెందిన డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఇఫ్తార్‌లో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పోసిరిగారి విష్ణు, మాజీ ఎంపీటీసీ తిరుమలేష్, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు హనుమంతు నాయక్, తౌఫిక్,హరీష్ నాయక్, రాకేష్‌గౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

#### ప్రపంచశాంతి కోరుతూ ప్రార్థనలు

**ఆత్మకూర్:** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు శనివారం రాత్రి స్థానిక మస్‌జిదే నూర్‌లో రియల్టర్ ఖాజా ఆధ్వర్యంలో, మస్జిదే సయ్యదియాలో పూలవ్యాపారులు ఇంతియాజ్, ఖయ్యూమ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌలాన అబ్దుల్‌అలీంరశాది ప్రపంచశాంతి కోరుతు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వహకులు, ముస్లిం పెద్దలు, దీక్షపరులు పాల్గొన్నారు.



# రెండోరోజు పదో తరగతి పరీక్షలు ప్రశాంతం


పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

**సాక్షి, నెట్‌వర్క్:** పాన్‌గల్ మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో రెండో రోజు శనివారం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. బాలుర ఉన్నత పాఠశాలల్లో 210 మంది, బాలికల ఉన్నత పాఠశాలల్లో 139 మంది కలిపి మొత్తం 349 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు అజీమ్‌పాష, విజయలక్ష్మి, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు రాజవర్ధన్‌రెడ్డి, మంజుల తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిసరాలల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా స్థానిక పోలీసులకు బందోబస్తు ఏర్పాటు చేశారు.

- ఆత్మకూర్‌లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ చాంద్‌పాష పరిశీలించారు. కేంద్రాల్లో సౌకర్యాలు సమకూర్చమని ఎంఈఓ బాలరాజు తెలిపారు. విద్యుత్, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం కల్పించినట్లు వివరించారు. ఆత్మకూర్‌లో మూడు పరీక్ష కేంద్రాలు బాలికల ఉన్నతపాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల, కాలేజీ హైస్కూల్లో 633 మంది విద్యార్థులకుగాను ఒక్కరు మాత్రమే గైర్హాజరైనట్లు తెలిపారు. సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేసారు.


ఆత్మకూర్‌లోని పరీక్ష కేంద్రాల తహసీల్దార్

- గోపాల్‌పేట మండలంలో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా పరిషత్ పాఠశాల (బాలుర)లో 220 మంది విద్యార్థులకు గాను 220 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. బాలికల పాఠశాలలో 175 మంది విద్యార్థులకు 174 మంది విద్యార్థులు హాజరయ్యారు.
- అమరచింత మండల కేంద్రంలోని డీఎంఆర్‌ఎం, జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఒక విద్యార్థి హాజరు కాలేదని ఎంఈఓ భాస్కర్ సింగ్ తెలిపారు. రెండు పరీక్ష కేంద్రాలలో 253 మంది విద్యార్థులకు గాను 252 మంది హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలను పెబ్బేరు ఎంఈఓ, మండల డీటీ రెడ్యానాయక్‌లు సందర్శించారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్‌ను అమలు పరిచామని ఎస్ఐ సురేష్‌లు తెలిపారు.

### విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



**వనపర్తి రూరల్:** మండలంలోని అంజనగిరి ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలనదినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఉపాధ్యాయులు చెన్నమ్మ, కార్యదర్శి హరిత, పాల్గొన్నారు.

### ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించండి



**ఖిల్లాఘనపురం:** మండల కేంద్రంలో ఉపాధిహామీ పనులు చేయించేందుకు ఫీల్డ్ అసిస్టెంటును నియమించాలని గ్రామస్తులు శనివారం ఎంపీడీఓ వెంకటాచారికి వినతి పత్రం ఇచ్చారు. గ్రామంలో పనిచేస్తున్న సీనియర్ మేట్లలో ఒకరిని ఫీల్డ్ అసిస్టెంటుగా నియమించి కూలీలకు, రైతులకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో మణెమ్మ, అనిల్, వెంకటయ్య, రాము, రాకేష్, సంగీత, సుజాత పాల్గొన్నారు.

### మహిళా రైతులకు రాయితీపై పరికరాలు

**గట్టు:** వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా మహిళా రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు అందజేస్తున్నట్లు వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం 2024–25 సంవత్సరానికి గాను వ్యవసాయ యాంత్రీకరణపై ఉప- మిషన్ పథకం ద్వారా 50 శాతం రాయితీపై పనిముట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. రూ. 2.72 లక్షలతో 20 యూనిట్లను మండల మహిళా రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్–7, రోటోవేటర్లు–3, తైవాయన్ స్ప్రేయర్లు–7, కల్టివేటర్, ఎంబీప్లగ్, కేజీ వీల్స్–3 ఉన్నట్లు తెలిపారు. అర్హులైన మహిళా రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డుతో ఈనెల 26 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

### వ్యవసాయ యాంత్రీకరణకు నిధులు

**అలంపూర్:** వ్యవసాయ యాంత్రీకరణకు నిధులు మంజూరైనట్లు మండల వ్యవసాయ అధికారి నాగార్జున్‌రెడ్డి తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా 2024– 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మహిళా రైతులకు ఉప మిషన్(ఎస్ఎంఏఎం) పథకం కింద నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. మహిళా రైతులకు 50 శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లకు రూ. 2.06 లక్షలతో 15 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. మహిళా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.